క్లుప్తంగా

పరిశ్రమల వ్యర్థాలతో పంట భూములకు నష్టం

పూసపాటిరేగ : పరిశ్రమలు వ్యర్థాలతో పంట భూములు నాశనం అవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీహెచ్ అగ్రహారం పరిధిలో సాగు భూమిలో వ్యర్థ జలాలు వేయడంతో పంటలు నాశనం అవుతున్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన అంబల్ల నారాయణమ్మకు చెందిన పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు పరిశ్రమ వ్యర్థ జలాలు వేసారని తెలిపారు. పంట పొలాలలో విడిచి పెట్టడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో రాధికకు వినతి పత్రం అందజేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సచివాలయం ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా శనివారం పలు గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తున్నామని ఆ శాఖ డీఈఈ త్రినాధరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం, పూతికపేట, కొండగుంపాం, గరికిపేట, మొయిద, కొండవెలగాడ, పారసాం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాగ్రత్తలు తప్పనిసరి

బాడంగి: రైతులకు నష్టం వాటిల్లకుండా ఎరువుల డీలర్లు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జి.సూర్యప్రకాష్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖా కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులు విక్రయించినప్పుడు తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు, అమ్మకాలు, ధరల వివరాలను బోర్డులో ప్రదర్శించాలన్నారు. సమావేశంలో ఏఈఓ సునీత, వీఏఏలు శరత్, రాంబాబు, జయలక్ష్మి, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రాజాం సిటీ: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. 45 రోజులుగా నిరసన తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 22 అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె చేయనున్నామని, పట్టణ వాసులంతా సహకరించాలని కోరారు. సంవత్సరంలో వచ్చే ఆదివారాలు, దేశ, జాతీయ, రాష్ట్ర సెలవులు మొత్తం 72 రోజులు వేతనంతో కూడిన సెలవులుగా ప్రకటించాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని, టెక్నికల్స్‌కు రూ. 29,200, నాన్ టెక్నికల్స్‌కు రూ. 24,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ గౌరవాధ్యక్షుడు సీహెచ్ రామ్మూర్తి నాయుడు, హరిబాబు, అనిల్‌కుమార్, మరియదాసు, కృష్ణ, గణపతి, రామకృష్ణ, ప్రసన్న లక్ష్మి, సత్యనారాయణ, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ బాబూ..?

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు వచ్చేవరకూ నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని, ప్రతి ఇంటికీ బాండ్‌లతో కూడిన హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఆ మాటే మరిచిపోయారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. యుగంధర్ అన్నారు. కూటమి పాలనలో హామీల విస్మరణపై ఏఐవైఎఫ్ కమిటీ సభ్యులు శుక్రవారం స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా, ఉద్యోగాలు తీయకుండా యువతను దగా చేశారని మండిపడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా నిర్వహించిన సర్వే ప్రకారం 26 జిల్లాల్లో 2.67 కోట్ల మంది వివరాలు సేకరిస్తే అందులో ఉపాధి లేనివారి సంఖ్య కోటిన్నర పైనే ఉందన్నారు. నిరుద్యోగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, డివిజన్ కార్యదర్శి వి. శ్రావణ్, కమిటీ నాయకులు పి. చిన్నమ్మి, ఆర్. శేఖర్, బి. మురళి పాల్గొన్నారు.

రాత్రి 2 గంటలకే.. బయలుదేరండి..

- యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి సిబ్బందిపై ఒత్తిడి
- కార్పొరేషన్ నుంచి 114 బస్సుల్లో 5,600 మంది తరలింపు
- అక్కడికి వెళ్లకుంటే స్థానిక కార్యక్రమంలో పాల్గొనేలా ఆదేశాలు
- అధికార యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి
- మాకేందుకు అర్ధరాత్రి మద్దెల దరువులు అంటున్న సామాన్యులు



నగరంలో నిర్వహించిన సామూహిక యోగాసన కార్యక్రమాల్లో ఆసనాలు వేస్తున్న కమిషనర్

విజయనగరం: కూటమి ప్రభుత్వం కొన్ని రోజులుగా నిరంతరం యోగా మంత్రం జపిస్తుండడంతో ప్రభుత్వ యంత్రాంగం ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతోంది. యోగాంధ్ర కార్యక్రమానికి మే 21 నుంచి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం విదితమే. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖ కేంద్రంగా ఐదు లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాని మోదీ కూడా హాజరవుతుండడంతో ఎలాగైనా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుస్తీలు పడుతోంది. దీంతో అధికారులు, ఉద్యోగులకు క్షణం తీరిక లేకుండా పోయింది. గత నెల రోజులుగా యోగాంధ్ర ఎన్రోల్మెంట్, మాస్టర్ ట్రైనీ, రిజిస్ట్రేషన్, యోగ ప్రోటోకాల్ ఆసనాలు పూర్తి చేసినప్పటికీ జిల్లా స్థాయి యోగాసనాల పోటీల నిర్వహణ మాత్రం తమ వల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. ఎందుకంటే సాధ్యం కానీ అలవాటు లేని ఆసనాలతో పోటీలు నిర్వహించాలని అధికారులు మార్గదర్శకాలు పేర్కొనడంతో కొత్తగా యోగా నేర్చుకున్న తాము ఈ ఆసనాలను ఎలా వేయగలమంటూ పోటీల్లో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

అర్ధరాత్రి 2 గంటలకే బయలుదేరాలి:

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. గత నెల రోజులుగా ప్రతి రోజు ఏదో ప్రాంతాల్లో యోగాసన కార్యక్రమాలు నిర్వహించిన విషయం విదితమే. శనివారం విశాఖలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శాయశక్తులు ఒడ్డుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రక్రియలో అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సచివాలయం నుంచి కనీసం 300 మందిని తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సచివాలయాల వద్దకు వచ్చే బస్సులకు ఇంచార్జ్‌లుగా ఆర్పీలను, మేస్త్రీలను నియమించగా.. స్థానికులను బస్సుల్లో ఎక్కించే బాధ్యత వారికే అప్పగించారు. మొత్తంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 114 బస్సుల్లో 5600 మందిని విశాఖలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి తరలించాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అయితే వారంతా శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటలకే తెల్లవారితే శనివారం ఆయా సచివాలయాల వారీగా కేటాయించిన బస్సుల్లో బయలుదేరించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి. మిగిలిన వారంతా స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో 5000 మందితో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు చేపట్టడం గమనార్హం. యోగాంధ్ర కోసం నెల రోజుల పాటు నరకయాతన పడుతున్నామని అధికారులు తమ అంతర్గత సంభాషణలో తలలు పట్టుకుంటున్నారు. పని ఒత్తిడి భరించలేక సచివాలయం నుంచి మండల స్థాయి ఉద్యోగుల వరకు అంతా నరకం చూస్తున్నారు.

పోటీల నిర్వహణలో పారదర్శకత ఎంత...?

జిల్లా స్థాయిలో యోగా పోటీలకు సంబంధించి 10 నుంచి 18 సంవత్సరాలు, 19 నుంచి 35 సంవత్సరాలు, 35 పైబడి అంటూ మూడు భాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి 50 ఏళ్ల పైబడిన కేటగిరీ ఇవ్వకపోవడంతో యోగాలో అనుభవం, ఆసక్తి ఉన్న ఆ వయస్సు వారితో పోటీ పడే పరిస్థితి ఏర్పడింది. వారంతా పోటీలో పాల్గొనడానికి ఆసక్తి కనపరచడం లేదు. ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్న వారిని సైతం పోటీల్లో అభ్యర్థులుగా చేర్చడంతో క్లిష్టతరమైన ఆసనాలు వేయలేమని తమ పేర్లను తొలగించేశారు. చిన్న పిల్లలకు ఆకర్ణధనురాసనం, బకాసనం, 19 నుంచి 35 సంవత్సరాల విభాగంలో మత్స్యేంద్రాసనం, జిల్లా స్థాయిలో విభక్త పశ్చిమోత్తానాసనం తదితర ఆసనాలు వేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో పూర్ణమత్స్యేంద్రాసనం, ఓంకారాసనం, కర్ణ పీడనాసనం ఇచ్చారు. కార్పొరేషన్ మండల స్థాయి పోటీలను ఏదోలా మమ అనిపించినప్పటికీ జిల్లా స్థాయి పోటీలకు వెళ్లేవారిని పంపించడం కష్టతరమేనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల యోగా నమూనా ఆకృతి



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శశాంక్ ఆసనం ద్వారా యోగ నమూనా ఆకృతితో శుక్రవారం ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జి.లక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.లీలాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - డెంకాడ

చూడముచ్చట...



విజయనగరంలోని పెద్ద చెరువు వద్ద ఒకే చోట విభిన్న జాతుల జీవరాశులు అన్యోన్యంగా ఉంటూ చూపరులను ఆకట్టుకున్నాయి. ఒకే వరలో రెండు కత్తులు ఇమడవన్న సామెత ఉన్నా... అందుకు భిన్నంగా పెద్ద చెరువు వద్ద శుక్రవారం రెండు బాతులు, ఒక కొంగ ఇలా చిత్రంలో అన్యోన్యత పాటిస్తూ చూపరులను ఆలోచింపజేస్తూ ఆకట్టుకున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

విద్యార్థుల యోగాసనాలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

భోగాపురం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని భోగాపురం మండలంలోని చెరుకుపల్లి అవంతి కళాశాలలో విద్యార్థులు శుక్రవారం యోగాసనాలు వేశారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని, ప్రతి ఒక్కరు యోగా చేయడం దినచర్యగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డైరెక్టర్ చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ పీఓ షరీఫ్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీ నుంచి యోగాంధ్రాకు 180 బస్సులు

విజయనగరం అర్బన్: విశాఖలో శనివారం జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి హాజరయ్యే జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల 9,612 మంది విద్యార్థుల కోసం 180 బస్సులు ఏర్పాటు చేశారు. విశాఖ బీచ్ రోడ్ నుంచి భీమిలి బీచ్ వరకు ఏర్పాటు చేసిన 15 కంపార్ట్ వీరంతా పాల్గొంటారు. నెల రోజులుగా కళాశాలల ప్రాంగణాలలో అవగాహన శిక్షణ పొందిన వారంతా హాజరవుతున్నారని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ తెలిపారు.

'భోజనం' బిల్లులు, జీతాలు తక్షణమే చెల్లించాలి

- సీఐటీయూ డిమాండ్

విజయనగరం గంటస్తంభం: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బకాయి బిల్లులు, జీతాలు తక్షణమే చెల్లించాలని, మెనూ చార్జీలు విద్యార్థికి 20 రూపాయలు పెంచాలని, వర్కర్లకు నెలకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, 2 జతల కాటన్ దుస్తులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక కస్పా హైస్కూల్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో భోజన కార్మికులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ..పిల్లలకు రుచికరమైన వేడివేడి నాణ్యమైన భోజనం అందించేందుకు వర్కర్లకు ట్రైనింగ్ ఇవ్వడం అభినందనీయమని, ప్రస్తుత ధరల్లో పిల్లాడికిచ్చే 5.88 రూపాయలు, 8.57 రూపాయలతో నాణ్యమైన భోజనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2024 అక్టోబర్లో చార్జీలు పెంచినట్టు ప్రకటించి నేటికి బిల్లులు ఊసే లేదని మండిపడ్డారు. నెలలు తరబడి బిల్లులు, జీతాలు చెల్లించకపోతే వంట ఎలా సాధ్యమన్నారు. పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయటానికి అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తరగతుల్లో ప్రవేశానికి ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నెల్లిమర్లలో ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థినిలు పరీక్షకు గంట ముందుగా హాజరు కావాలని కోరారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



మంచినీటి ట్యాంకును ప్రారంభించిన బాబ్జి

విజయనగరం గంటస్తంభం: దేశంలోని గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే గిరిజనులు అభివృద్ధి చెందుతారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం అనంతగిరి మండలం డముకు గ్రామంలోని సంత వద్ద దుర్గమ్మ గుడి ఆవరణలో పరిసర గ్రామాల గిరిజన పాదచారుల కోసం మాతృభూమి సేవా సంఘం, లివింగ్ వాటర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకుని ప్రారంభించారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ... డముకు గ్రామంలో ప్రతి శుక్రవారం స్థానికుల సహకారంతో స్థానిక గ్రామీణ వైద్యుడు నగేష్, స్థానికులు జయమ్మ, కిరణ్,రమేష్, ఉదయ్ ఆధ్వర్యంలో మాతృభూమి సేవా సంఘం పేరుతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇక్కడ ప్రతి కార్యక్రమంలో గిరిజన యువత పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన యువతకి తగిన ఉపాధి కల్పన కోసం తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు. గిరిజన కార్పొరేషన్ ద్వారా గిరిజన ఉత్పత్తులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మాతృభూమి సేవాసంఘం అధ్యక్షుడు పొన్నాడ కనకాచారి, కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, ఉపాధ్యక్షులు సిరిపురపు శంకర్, భీంపల్లి భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములు దక్కేలా చూడండి



ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న

- ఎస్టీ కమిషన్ చైర్మన్‌కి శ్రీకాకుళం గిరిజనుల వినతి

విజయనగరం అర్బన్: శ్రీకాకుళం జిల్లా మందస మండలం చీపి గ్రామ పంచాయతీ బెత్తుకోలలో సాగు చేసుకుంటున్న భూములను తమకు దక్కేలా చూడాలని 15 గిరిజన కుటుంబాలు శుక్రవారం స్థానికంగా ఉన్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సర్వే నంబరు 35564లో ఉన్న భూమి సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. అదే విధంగా అనారోగ్య సమస్యలు తలెత్తినపుడు తక్షణ వైద్య సహాయం కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. రహదారులు లేకపోవడంతో త్వరితగతిన వైద్య సహాయం పొందలేకపోతున్నామని తెలిపారు.

సాగు భూమి సమస్యతో పాటు అనేక ఇబ్బందులు పడుతున్నామని చైర్మన్‌కు విన్నవించారు. ఆయా ప్రాంతాలను పర్యటించి సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తానని చైర్మన్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన గిరిజన కుటుంబాలతో పాటు శ్రీకాకుళం జిల్లా గిరిజన ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ ఉన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచే బాధ్యత హెచ్‌ఎంలదే..

- ఎంఈఓ తిరుమల ప్రసాద్



మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే బాధ్యత ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈఓ తిరుమలప్రసాద్ స్పష్టం చేశారు. ఎంఈఓ -2 పెంటయ్యతో కలిసి శుక్రవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించిన వాటిలో విద్యార్థుల సంఖ్య వంద దాటేలా చూడాలని.. లేదంటే మళ్లీ బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజూ పాఠశాలలో ఉదయం 9.30 గంటలకే టీచర్ హాజరుతో పాటు విద్యార్థుల హాజరు లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్ఈఆర్‌టీ విడుదల చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం తరగతుల నిర్వహణ జరగాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తయ్యేలా ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

నేడు నగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. జీవితంలో యోగాను అంతర్భాగంగా చేసుకుని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పరిపుష్టం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడారు. యోగ సాధన ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని తద్వారా మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. ఎంతో ఉత్కృష్టమైన యోగా ప్రక్రియలను చేయాలన్న ధ్యేయంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శనివారం యోగాంధ్ర పేరిట యోగా దినోత్సవం నిర్వహిస్తున్న విషయం తెలిసిందేనని అన్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియం వద్ద పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 6:30 గంటలకు రాజీవ్ స్టేడియంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించిన అనంతరం ర్యాలీ కూడా ఉంటుందన్నారు. అలాగే స్వర్ణాంధ్రా-స్వచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని పురస్కరించుకుని క్లీన్ మైండ్, క్లీన్ బాడీ అనే నినాదంతో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ముఖ్యంగా మొక్కలు నాటడం, సామూహిక పారిశుధ్య విధానాలు చేపట్టడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలు, ఇంకుడు గుంతల పునరుద్ధరణ, కాలువలలో పూడికతీత, కార్యాలయాలు పరిశుభ్ర పరిచే చర్యలు, వ్యర్థ జలాల పరిరక్షణ వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అధ్వానంగా ప్రధాన రహదారి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆవేదన



వేపాడ ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని ఆర్అండ్‌బీ జేఈకి వివరిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, కోఆప్షన్ సభ్యుడు నరసయ్య

వేపాడ: మండల కేంద్రం వేపాడ ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, ఏడాదిన్నర అవుతున్నా నేటికీ రోడ్డు వేయకపోవటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ సత్యవంతుడుతో పాటు కోఆప్షన్ సభ్యుడు నరసయ్య తదితరులు ఆర్అండ్‌బీ జేఈ స్వామిని ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్యసమావేశంలో శాఖాపరమైన అంశంపై ఎంపీపీ, కోఆప్షన్ సభ్యులు మాట్లాడుతూ మండల కేంద్రం ప్రధాన రహదారిలో వేపాడ, వల్లంపూడిలో రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన స్థలంలో సైడ్ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో గృహస్తులు, వృద్ధులు ఇంటిముందు ఇసుక బస్తాలు వేసుకున్నారని ఇంట్లోకి వెళ్లాలన్నా బయటకు రావాలన్నా వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన జేఈ స్వామి మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే కాలువల నిర్మాణం చేపట్టేలా చూస్తామన్నారు.

బిల్లు పెండింగ్ పెట్టడం న్యాయమా?

సమావేశంలో వావిలపాడు సర్పంచ్ బీల రాజేశ్వరి మాట్లాడుతూ పంచాయతీ తీర్మానంతో గతంలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో చెరువుగట్టుపై రైతుల అవసరాలమేరకు మెటల్ రోడ్డు వేశామని ఈ ఏడాది ఆ మెటల్ రోడ్డుపై సీసీ రోడ్డు వేస్తే ఎవరో ఫిర్యాదు చేశారని ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రెవెన్యూఅధికారులు వచ్చి పరిశీలించారని ప్రజలకు రైతులుకు ఉపయోగపడే రోడ్డుపై అభ్యంతరాలను పరిశీలించిన అధికారులు నేటికి ఎటువంటి నివేదిక ఇవ్వకపోవడంతో బిల్లు పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సీసీ రోడ్డుపై రోడ్డువేసినా పట్టించుకోని అధికారులు ప్రజల అవసరం మేరకు పంచాయతీ తీర్మానంతో పనిచేస్తే అభ్యంతరం చెప్పటమేమిటని ప్రశ్నించారు. దీనిపై ఇరిగేషన్ ఎఈ మాట్లాడుతూ చెరువుల హద్దులు, ఆక్రమణ రెవెన్యూ పరిధిలోనిదని తాము పరిశీలనకు మాత్రమే వచ్చామన్నారు. ఎంపీపీ కలగచేసుకుని పరిస్థితి పరిశీలించి బిల్లు అయ్యేలా చూడాలని కోరారు.

పరిచయం చేసుకున్న కొత్త వైద్యులు

సమావేశం జరుగుతుండగానే పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లిపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కొత్తగా బదిలీపై వచ్చిన ఆయుర్వేద, హోమియో, పీహెచ్‌సీ, పశుసంవర్థక శాఖ వైద్యులు, వ్యవసాయశాఖ ఏఓ,స్వాతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సమావేశంలో తమను తాము పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ చినరామునాయుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వర్రావు తదితర మండల శాఖాధికారులు పాల్గొన్నారు.